## కరంజిలో పులి సంచారం


పులి పాదముద్రలను సేకరిస్తున్న అధికారులు

జైనథ్, జనవరి 7 : కరంజి గ్రామ శివారులో మంగళవారం పులి సంచారం చేసిన ఆనవాళ్లు కనిపించినట్లు అటవీ శాఖ అధికారులు రాథోడ్, రాజేందర్, గులాబ్ తెలిపారు. మహారాష్ట్ర దిగ్రాస్ పెన్‌గంగా నది ఆవలి ఒడ్డు నుంచి తెలంగాణ వైపు వచ్చినట్లు పులి పాదముద్రలు కనబడినట్లు తెలిపారు. తిరిగి పులి మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా.. పెన్‌గంగా నది ఆవలి ఒడ్డున రాత్రి వేళల్లో పులులు సంచరిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఉదయం 10 గంటల తర్వాతనే పొలం పనులకు వెళ్లి తిరిగి, సాయంత్రం 4 గంటలలోపు ఇంటికి చేరుకోవాలని సూచించారు. పెన్‌గంగా పరీవాహక ప్రాంతం చుట్టూ పులి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ గాలింపులో ఎఫ్ఎస్‌వో విజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం..

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**


భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, జనవరి 7 : బోథ్ నియోజకవర్గాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం నాగపూర్ గ్రామంలో పర్యటించా రు. నూతన గ్రామ పంచా యతీ భవనం, కమ్యూని టీ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని జగదాంబదేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

# ‘ఆసరా’ పెంపు లేనట్టేనా..?

- ఏడాది గడిచినా అమలు కాని సీఎం రేవంత్ హామీ
- ఆదిలాబాద్ జిల్లాలో 73,213 మంది లబ్ధిదారులు



ఆదిలాబాద్, జనవరి 7(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో పింఛన్లను పెంచే విషయంలో ప్రస్తావవ వస్తుందని ఆశించినా మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశ మిగిలింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు అరకొర పింఛన్లు అందచేశారు. సమైక్య రాష్ట్రంలో వృద్ధులు పింఛన్ల కోసం ఎన్ని దరఖాస్తులు సమర్పించినా మంజూరు అయ్యేవి కావు. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా పింఛన్లు రాకపోయేవి.

**ఏడాదిగా ఎదురుచూపు**

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్లతో అభాగ్యులకు చేయూత అందించింది. వృద్ధులు, వితంతువులు, గీత, చేనేత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎంఆర్‌టీ, ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు నెలకు రూ. 2016, దివ్యాంగులకు రూ.4016ను పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేస్తే ఆసరా పింఛన్‌దారులకు ప్రయోజనం చేకూరుతుంది. సంక్రాంతి పండుగకైనా పింఛన్ల పెరుగుదల ప్రకటన వెలువడుతుందని ఆశించినా లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు కోరుతున్నారు.

### కేసీఆర్ సార్ పింఛనే వస్తున్నది..



అప్పుడు కేసీఆర్ సారు పెంచి ఇచ్చిన రూ.2016 వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఇస్తామన్న రూ.4 వేలు ఇప్పటిదాకా కండ్ల చూడలేదు. ఈ సర్కార్ మాట తప్పింది. పింఛన్ రూ.4 వేల మీద అందరికీ ఆశ ఉన్నది. కానీ.. కాంగ్రెస్ సర్కార్ మీద నమ్మకం పోయింది. పింఛన్‌లు పెంచుడు కూడా మరో కేసీఆర్ సార్ గద్దె ఎక్కినంకనే అని అంటున్నారు మా గ్రామస్తులు.

*- రాథోడ్ బతాసిబాయి, పింఛన్ లబ్ధిదారు, భీంపూర్.*

**ఆదిలాబాద్ జిల్లాలో..**

| పింఛన్‌దారు | సంఖ్య |
|---|---|
| వృద్ధాప్య | 29,717 |
| వితంతు | 28,610 |
| దివ్యాంగ | 7,020 |
| బీడీ | 5,565 |
| ఒంటరి మహిళలు | 2,241 |
| గీత | 41 |
| చేనేత | 19 |
| మొత్తం | 73,213 |

### భూమి లేని కూలీగా కష్టమవుతుంది..





మాకు భూమి లేదు. రోజు కూలి చేయనిదే పూట గడవదు. నా భర్త కొన్నేళ్ల క్రితం మరణించాడు. ముగ్గురు ఆడపిల్లలతో బతుకు కష్టమైతంది. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు వచ్చిన రూ.2016 సాయంగా నిలుస్తున్నాయి. కేసీఆర్ సార్ సర్కారు సాయం బాగుండె. అప్పు సప్పు చేసి, కల్యాణలక్ష్మి, సాయంతోని ముగ్గురు ఆడపిల్లల పెండ్లిళ్లు చేసిన. ఇప్పుడు రూ.2016 పింఛనే దిక్కు. అది సరిపోతలేదు. సీఎం రేవంత్ సార్ రూ.4 వేలు ఎటుపోయినయో ఏమో? ఇప్పటికైనా సర్కార్ ఆలోచించాలి. *- చౌహాన్ బేబీబాయి, వితంతు పింఛన్, లబ్ధిదారు, భీంపూర్*

# 7,47,644

## నిర్మల్ జిల్లాలో ఓటర్లు





- తుది జాబితా విడుదల
- 24,255 మంది కొత్త ఓటర్లు
- కొత్త ఓటర్లలోనూ మహిళలదే పైచేయి

నిర్మల్, జనవరి 7(నమస్తే తెలంగాణ) : త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లాలవారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. ఈ మేరకు నిర్మల్ జిల్లాలో 7,47,644 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,59,393 మంది, మహిళా ఓటర్లు 3,87,227 మంది ఉన్నారు. అలాగే ట్రాన్స్‌జెండర్‌లు 52 మంది, సర్వీస్ ఓటర్లు 972 మంది ఉన్నారు. జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో 925 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కాగా.. గత శాసనసభ ఎన్నికల నాటితో పోలిస్తే ఈ సంవత్సరకాలంలో 24 వేలకు పైగా కొత్త ఓటర్లు పెరిగారు. మొత్తం ఓటర్లతోపాటు కొత్తగా నమోదు చేసుకున్న వారిలో మహిళలదే పైచేయిగా కనిపిస్తున్నది. కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న వారిలో యువత కొంతమేర వెనుకంజలో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. నవంబర్ 2023లో అసెంబ్లీకి ఎన్నికలు జరుగగా, అప్పట్లో జిల్లాలో 7,23,389 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా ప్రకటించిన తుది జాబితాలో 7,47,644 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ లెక్కన జిల్లాలో కొత్తగా 24,255 మంది ఓటర్లు పెరగడం గమనార్హం. ఏడాది కింద మహిళలు 3,72,829 మంది ఉండగా, తాజాగా వీరి సంఖ్య 3,87,227కి పెరిగింది. అంటే కొత్తగా 14,398 మంది కొత్త మహిళా ఓటర్లు పెరిగారు. జనాభా పరంగా ఆధిక్యంలో ఉన్న మహిళలు ఓటరుగా నమోదులోనూ అదే వరుసలో నిలుస్తున్నారు. అయితే పురుష ఓటర్ల సంఖ్యలో మాత్రం పెద్దగా తేడాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 3,50,509 మంది పురుష ఓటర్లు ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 3,59,393కి చేరింది. అంటే ఈ ఏడాది కాలంలో 8,884 మంది మాత్రమే పెరిగారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నా.. సెల్‌ఫోన్‌తో గడిపే యువత కనీసం ఆన్‌లైన్‌లో నైనా తమ ఓటును నమోదు చేసుకోకపోవడం శోచనీయం. త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రస్తుతం రాజకీయవర్గాలు ఓటర్ల జాబితాను ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి.

## అంగన్‌వాడీల ధర్నా


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

ఎదులాపురం, జనవరి 7 : గత ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.18 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. గౌరవ వేతనం కనీసం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించి, వేతనాలు పెంచడంతోపాటు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రకళ, చాయ, సంగీత, సుశీల, రుక్మిణి, జంగుబాయి, తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ కోసం..


తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న బీడీ కార్మికులు

బోథ్, జనవరి 7 : పింఛన్ అందించాలని కోరుతూ మంగళవారం బీడీ కార్మికులు కదం తొక్కారు. బోథ్‌లోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు నెలనెలా రూ.4 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రూ.4,016 పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతి పత్రం అందజేశారు. వీరితోపాటు బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, గోదావరి, ఎల్.నరేశ్, కార్తీక్, నితీష్, మున్సిఫ్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి..



నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నిర్మల్ అర్బన్, జనవరి 7 : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని, వారి వేతనాలను పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాణి, అర్చన, జయంతి, లావణ్య పాల్గొన్నారు.

## అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి

**ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు**

ఎదులాపురం, జనవరి 7 : సమాజంలో చిన్నపిల్లలపై అఘాయిత్యాలు ఎక్కువ జరుగుతున్నాయని, అలాగే వాళ్లకు ఉన్న సివిల్ హక్కులకు భంగం వాటిల్లుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యాలయ సమావేశ మందిరంలో ప్యారలీగల్ వలంటీర్లకు రెండు శిక్షణ సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. చిన్నారులపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని అవి బయటకు రావడం లేదన్నారు. చిన్నారుల హక్కులు, చట్టాల వంటి అంశాలపై రెండు రోజులపాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, జనవరి 7 : బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా సర్వీసు అందిస్తున్నామని, ఒక విధంగా మాది అరణ్యవాసం అయ్యింది కాని ఆత్మగౌరవంతో కూడిన వేతనం లేదని అన్నారు. కాంట్రాక్టు వ్యవస్థలో మా యొక్క సేవలను అందిస్తు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తు, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణీ కారణంగా చాలి చాలని జీతాలతో మా జీవనాన్ని కొనసాగిస్తు ఎన్నో విధాలుగా మా యొక్క ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ ప్రభుత్వం అయిన వెంటనే స్పందించి తమకు బేసిక్, ఎచ్ఆర్ఎ, డీఏ, మూడు శాతం వార్షిక పెరుగుదలతో కూడిన జీతాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం 77 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓఎస్‌డీ, ఏవోలకు వినతి పత్రం అందజేశారు.


కాంగ్రెస్ నాయకులను బయటికి తీసుకెళ్తున్న పోలీసులు


నార్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# అధికారులకు ఎమ్మెల్యే వార్నింగ్

### నార్నూర్‌లో 96 మందికి చెక్కుల పంపిణీ

నార్నూర్, జనవరి 7 : ప్రభుత్వ కార్యక్రమాలు ప్రొటోకాల్ ప్రకారమే చేపట్టాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ మూబారక్ చెక్కుల పంపిణీని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నార్నూర్, గాదిగూడ మండలాలకు చెందిన 96 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయంలోనే పేటింటి ఆడపడుచులకు పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు గొడవ చేస్తుంటే పోలీసులు ఎందుకు ప ట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ మాత్రమే పాటించాలని, ప్రజాప్రతినిధులకు రక్షణగా ఉండాలని.. అధికారులు, పోలీసులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పునఃరావృత్తం కాకుండా చూడాలన్నారు. నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, తహసీల్దార్లు జాడి రాజాలింగం, విజయానందం, ఎంపీడీవో జవహర్‌లాల్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్‌నాయక్, వైస్ మాజీ చైర్మన్ నాగోరావ్, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మహిళ సంఘం అధ్యక్షురాలు రాథోడ్ దేవ్‌కాబాయి పాల్గొన్నారు.

### బీటీ రోడ్డు, షెడ్డు నిర్మాణానికి భూమిపూజ..

నాగల్‌కొండలో షెడ్డు, బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాగల్‌కొండ నుంచి మాన్కాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, షెడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారన్నారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాగా.. కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌తో కలిసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో లేకపోయినా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, న్యాయవాది బానోత్ జగన్ పాల్గొన్నారు.

## సోలార్ వినియోగంతో ఆర్థిక పురోగతి

**ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్**


వివరాలను పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి, జనవరి 7 : బాలాజీ సోలార్ ఏజెన్సీ సబ్సిడీపై అందించే ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా ఆర్థిక పురోగతిని సాధించాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం ముత్నూర్ గ్రామంలో సోలార్ విద్యుత్ వినియోగంపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ.. రూ.2 లక్షల విలువ గల సోలార్ విద్యుత్ ప్లేట్స్‌ను కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలతో సబ్సిడీపై మంజురు చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఇప్పటికి 81 కుటుంబాలను గ్రామ పంచాయతీ అధికారులు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్, రిడ్కో సోలార్ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, జూనియర్ మేనేజర్ శ్రీమన్నరాయణ పాల్గొన్నారు.